
ప్రజాశక్తి

శుక్రవారం 7 జులై 2023



నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

నగర పంచాయతీ పరిధిలోని వెంకంపేట వాటర్ ట్యాంకర్‌కు సంబంధించిన సంకిలిలో గల పంపింగ్ పైప్ లైన్ రిపేర్ అయినందువల్ల పై ట్యాంక్ పరిధిలో గల 1, 2, 10, 11, 12, 13, 17, 18, 19, 20 వార్డులకు శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా జరగదని కమిషనర్ సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయని, మరమ్మతుల అనంతరం నీటిసరఫరా ఇవ్వగలమని, ఇందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



అన్నీ అసంపూర్తే

- పనుల పెండింగ్‌తో పూర్తిస్థాయిలో అందని తోటపల్లి నీరు
- అరకొరగా పునరావాసం - నత్తనడకన గృహ నిర్మాణం
- పూర్తికాని నాడు - నేడు పనులు
- విత్తనాలైనా సకాలంలో అందేనా?
- విద్యుత్తు ఛార్జీల పెంపుపై ప్రజల్లో ఆందోళన
- నేడు జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం

జిల్లాలో తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు, వాటికి భూములు త్యాగం చేసిన ప్రజానీకానికి పునరావాసం, నష్టపరిహారం మొదలుకుని అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అన్నీ అరకొరగాను, అసంపూర్తిగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్ పంటలకు అవసరమైన వరి, మొక్కజొన్న తదితర విత్తనాలైనా సకాలంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించగలదా? అన్న ఆందోళనతో ప్రజానీకంలో నెలకొంది. మరోవైపు ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో జనం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. మరోవైపు వర్షాకాల సీజన్ మొదలవ్వడంతో వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో గురువారం జరగబోయే జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో పై అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందా? లేదా అన్నదానిపై సర్వత్రా చర్చసాగుతోంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముంచుకొచ్చినా వర్షాభావం వెంటాడుతోంది. ఇప్పటికీ జిల్లాలో 34.9 మిల్లీ మీటర్ల వర్షం లోటు ఉంది. మరోవైపు జలాశయాల్లో నీరు తమ వరకు వస్తుందన్న దీమా రైతుల్లో లేదు. దాదాపు జిల్లాలోని అన్ని జలాశయాలు, కాలువల నిర్మాణం, నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా ఉండడమే ఇందుకు కారణం. విజయనగరం, పార్వతీపురం జిల్లాలతోపాటు శ్రీకాకుళం జిల్లా కలిపి 2,10,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన తోటపల్లి జలాశయం పనులు ప్రభుత్వ దృష్టిలో పూర్తయ్యాయి. ఇంకా చిన్నా చితక కాలువల నిర్మాణం ఉందని ప్రభుత్వం చెబుతోంది. కానీ, పిల్లకాలువలు, స్ట్రక్చర్లు పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం, ప్రధాన కాలువ నిర్వహణ సైతం సరిగా లేకపోవడం వల్ల శివారు ఆయుకట్టుకు సాగునీరు అందడం లేదు. కాలువల నిర్మాణంలో లోపం వల్ల ఇటీవల రెండు చోట్ల గండ్లు పడ్డాయి. తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించు కోలేకపోయారు. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్, ఆంధ్ర, తాటిపూడి, జంఝావతి తదితర జలాశయాల కాలువలు నిర్వహణ, అభివృద్ధి పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఓవైపు వర్షాభావం వెంటాడుతుండడం, మరోవైపు సాగునీటి వనరుల అభివృద్ధి అసంపూర్తిగా ఉండడంతో ఖరీఫ్ పంటలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

2004లో తలపెట్టిన రామతీర్థసాగర్ నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం కల్పించలేదు. ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది. పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74కోట్లు అవసరం కానుందని 2016లో అధికారులు అంచనా రూపొందించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడం వల్ల పెరిగిన ధరల నేపథ్యంలో రూ.87కోట్లు వరకూ పెరిగేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.204కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు.

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గృహ నిర్మాణం కూడా నత్తనడకన సాగుతోంది. జిల్లాలో 77,205 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు కేవలం 50శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా చెప్తున్న గుంకలాంలో10,136 ఇళ్లకుగాను ఇప్పటివరకు 242 మాత్రమే పూర్తయ్యాయి. రూ.220కోట్లతో తలపెట్టిన రెండో విడత నాడు - నేడు పనులు నేటికీ చాలా స్కూళ్లలో అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం 737స్కూళ్లకుగాను కేవలం 117స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ముఖ్యంగా పనుల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, హెచ్‌ఎంలతో సంబంధం లేకుండా పనులన్నీ జరిగిపోతున్నాయని సర్వత్రా చర్చసాగుతోంది. ప్రైవేటు స్కూళల్లో పుస్తకాల పేరిట భారీగా వసూళ్లకు పాల్పడుతుండడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటింటికీ రేషన్ అంటూనే సరుకుల్లో కోత విధిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాల్సింది. కానీ, చాలా ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో లేవు. ముఖ్యంగా సుగర్, థైరాయిడ్ వంటి రక్త పరీక్షలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేవు. ఈనేపథ్యంలో వీటన్నింటిపైనా జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో సమగ్రంగా చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సిమెంట్ కొనుగోలుకు అనుమతివ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాధ్యాన్యత పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సిమెంటు కొనుగోలుకు అనుమతించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెండో విడత రీ-సర్వే పనులు, ఉపాధి హామీ చట్టం, జగనన్న పాలవెల్లువ, పి.ఎం.కిసాన్ ఇ-కెవైసీ, ఆధార్ సీడింగు, స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, భూసేకరణ, కౌలురైతు కార్డులు పంపిణీ, గొడౌన్లు నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రీ సర్వే పథకాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు రెండో విడత రీసర్వేలో ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులు సెప్టెంబరు నాటికి పూర్తిచేసి సంబంధిత శాఖలకు అందజేయాలన్నారు. పిఎంకిసాన్ ఇ-కెవైసీ ఈనెల 31నాటికి పూర్తిచేయాలని, ఉపాధిహామీ పనుల్లో వందరోజులు పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.272 అందించాలని, ప్రతి కుటుంబానికి కనీసం 75రోజులు పని దినాలు తక్కువ కాకుండా అందించాలని, సకాలంలో పేమెంటు అందించాలని తెలిపారు. రాష్ట్రంలో కౌలురైతు గుర్తింపు కార్డులు జారీ లక్ష్యం 5.77లక్షలు కాగా, 3.84లక్షలు మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. ఈ లక్ష్యం మేరకు కార్డులు జారీచేయాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజల సమస్యల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ పనులు పూర్తయిన భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణంలో గల ప్రాధాన్యత భవనాలు గ్రామ సచివాయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసేందుకు అవసరమైన సిమెంటు కొనుగోలుకు అనుమతులు ఇవ్వాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, జిల్లా కోపరేటరేటివ్ అధికారి సన్యాసినాయుడు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గడపగడప కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

సేమ్ సీన్ రిపీట్

గడపగడపకు కార్యక్రమాన్ని వ్యతిరేకించిన గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ చింతలపాడుకు వెళ్లిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణిని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం ఆధ్వర్యంలో గిరిజనులు వ్యతిరేకించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా భారీ సంఖ్యలో గిరిజనులు పాల్గొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ మా గ్రామానికి రావొద్దని, గడపగడపకు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. హామీలు నెరవేర్చాలని, తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. వైసిపి నాయకులు, గ్రామస్తులు మధ్య కొంతసేపు వాగ్వివాదం జరిగింది. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా చింతలపాడుకు ఎమ్మెల్యే వస్తున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ప్రధాన రహదారిపై ఉదయం నుంచి బైఠాయించారు. బుధవారం దుడ్డుఖల్లులో ఎమ్మెల్యేకు జెఎసి నాయకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా గురువారం భారీ సంఖ్యలో పోలీసులు వచ్చి రక్షణ కల్పించారు. పోలీసుల సహకారంతో చింతలపాడు వెళ్లి గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు.

టిడిపి మాయమాటలు నమ్మి మోసపోవద్దు

డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - పాచిపెంట

బస్సు యాత్ర పేరిట టిడిపి నాయకులు గ్రామాల్లో పర్యటించి మోసపూరిత వాగ్దానాలు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించాలని చూస్తున్నారని వారి మాటలు నమ్మి మోసపోవద్దని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని కర్రివలస, మాతుమూరులో గురువారం నిర్వహించిన నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ప్రజలందరికీ సమానంగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా అవినీతి రహితంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. జగనన్న సురక్షతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, ఉచితంగా సర్టిఫికెట్లు అందించడం, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, కావున ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, పి.చినబాబు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, జి.ముత్యాలనాయుడు, దండి ఏడుకొండలు, సర్పంచ్ గంగమ్మ, మర్రి ఉమ, ఎంపిడిఒ జి.పార్వతి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాలూరు: పట్టణంలోని శివాలయం వీధిలో సీతారామ ధర్మశాలలో నిర్వహించిన అమ్మ ఒడి సంబరాల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ, మండలాలకు చెందిన విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద రూ.12.3కోట్ల మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు గొర్లి వెంకటరమణ రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, పట్టణ వైసిపి మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, ఎంఇఒ రాజ్ కుమార్ పాల్గొన్నారు.



పాచిపెంటలో జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని పెద్దకాపువీధి హై స్కూల్‌లో అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 5083 మంది లబ్ధిదారులకు రూ.6,60,97,000 వారి అకౌంట్లలో జమచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపి కణపాక సూర్యప్రకాష్, కౌన్సిలర్లు కొంచాడ అరుణ్, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్యే పి.విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రూ.6 కోట్ల 90,43,000 చెక్కును పంపిణీ చేశారు. ఎంఇఒ ఆనందరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి - ఉమామహేశ్వరరావు, వైస్ఎంపిపి పి.విజయ కుమారి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు కర్రి లీలాప్రసాదరావు, పిఎసిఎస్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కె.ప్రేమ్‌భూషణరావు, హెచ్‌ఎంలు కె.నాగమణి, సుంద్రో, ఉప్పాడ అప్పారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న పిఒ కల్పనాకుమారి

పాలకొండలో పిఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి గురువారం పాలకొండ మండలంలో విస్తృతంగా పర్యటించారు. సింగన్నవలసలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్జీదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. అలాగే సింగన్నవలసలోని రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. అనంతరం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు. ఇటీవల వచ్చిన మూడు డెంగీ కేసుల ఇళ్లను పరిశీలించారు. స్ప్రేయింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మలేరియా, డెంగీ కేసుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని బుక్కూరు హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించారు. హౌసింగ్ లబ్దిదారులతో మాట్లాడారు. లే అవుట్ కు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. లే అవుట్‌లో మంజూరైన 35 గృహాలకు పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎఇ మాధవరావును ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమేశ్వరరావు, ఎంపిడిఒలు, పిఆర్ ఇఇ రాధారాణి, డిఇ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ ఈనెల 8న జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గురువారం బందలుప్పిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ పుట్టిన రోజైన జూలై 8న ఆయన విగ్రహాన్ని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించున్నట్టు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి భారీ స్థాయిలో వైసిపి కార్యకర్తలు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

గురుకులాల్లో రెండో విడత కౌన్సిలింగ్


ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకుల కళాశాలల్లో పెంచిన సీట్లుకు రెండో విడత కౌన్సెలింగ్ స్థానిక బాలుర గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించారు. ఒక్కొక్క కళాశాలకు 40 చొప్పున సీట్లు కేటాయించగా, రెండో విడతలో మెరిట్ విద్యార్థులకు ఎటిడబ్ల్యూఒ జి.మంగవేణి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్లో పెద్దమడి, సీతంపేట బాలుర, సీతంపేట బాలికల కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు పైడి నాగభూషణం, పైడి సూర్యకుమారి, రేణుకేశ్వరరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిటిపుడవలస జంక్షన్లో గురువారం స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవా లని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.



రోడ్డుపై ఏనుగులు సంచరిస్తుండడంతో రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రహదారిపై ఏనుగుల సంచారం

గొల్లవాని వలస వద్ద నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురం- గరుగుబిల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పరిధిలోని గొల్లవాని వలస వద్ద గురువారం ఏనుగులు సంచరించడంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే ప్రధాని రహదారిపై తిష్ట వేయడంతో దాదాపు అరగంటసేపు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులపై ఏనుగులు సంచరిస్తుండడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. జిఎం వలస కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న ఏనుగులు ఇటీవల గరుగుబిల్లి మండలంలోని సీమలవానివలస, గొట్టివలస గ్రామాల్లో సంచరించి గురువారం గొల్లవానివలస తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. దీంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లవానివలసకు సమీపంలోని మామిడి తోటలో ఏనుగులు తిష్ట వేయడంతో రహదారిపై ప్రయాణించేందుకు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏనుగులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

20న సాగునీరు విడుదల

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

రానున్న ఖరీఫ్ - 2023 సీజన్ కు గాను తోటపల్లి పాత ఎడమ, కుడి ప్రధాన కాలువల ద్వారా సాగునీటిని ఈనెల 20న ఉదయం 10 గంటలకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ సబ్ డివిజన్ డిఇఇ దమలపాటి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ సాగునీటిని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ కేసులు రాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్లో డిఎంఒలు, మలేరియా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్ పక్కాగా జరగాలన్నారు. మలేరియా సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి మలేరియా, డెంగీ కేసులు వచ్చిన వెంటనే వారి సమీప కాంటాక్ట్‌లు, నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని అన్నారు. సమావేశానికి గూగుల్ మీట్‌లో హాజరైన ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, మెడికల్ ఆఫీసర్లతో మాట్లాడుతూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎంపిడిఒలు సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. డిఎల్‌డిఒలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో శ్రీకాకుళం, మన్యం జిల్లాల డిఎల్‌డిఒ గోపాలకృష్ణ, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, డిఎంఒలు, ఇతర మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ పట్ల జాగ్రత్తగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం : డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహనరావు అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లుంబేసులో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాల వద్ద నీటి కుంట నిల్వలు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. నీరు నిల్వ ఉన్నచోట డెంగీ దోమలు పెరగడానికి వీలుంటుందన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రామకష్ణ, కేశవరావు ఉన్నారు.



కురుపాంలో ర్యాలీ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

జీతాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

బకాయి ఉన్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. మన్మధరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రావాడ జంక్షన్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు గ్రీన్‌అంబాసిడర్లతో ర్యాలీ నిర్వహించి, అనంతరం ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు వి.కన్నంనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయంటే గ్రీన్‌అంబాసిడర్లే కారణమన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలను ఆరోగ్యంగా ఉంచుతున్నారని, అటువంటిది వారి కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. దీనికి తోడు ప్రభుత్వం ఇచ్చిన రిక్షాలు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురైతే వారు సొంత నిధులు ఖర్చుపెట్టి బాగు చేసుకుంటున్నారని అన్నారు. కావున వారికి నెలనెలా జీతాలు అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలో గల గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

చంద్రబాబుతో టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరగనున్నాయ్న ఊహాగానాల నేపథ్యంలో టిడిపి అధినేత చంద్రబాబు నియోజకవర్గ నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి చెందిన ప్రధాన నాయకులు ద్వారపురెడ్డి జగదీష్, ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ పరిశీలకులు బోయిన వరదరాజులు, పార్వతీపురం అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షులతో పాటు సీతానగరం, బలిజిపేట పార్టీ అధ్యక్షులు, బొబ్బిలి యువరాజు బేబీ నాయనలతో గురువారం చంద్రబాబు నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నేతల మధ్య ఉన్న విభేదాలను పక్కపెట్టి వారి మధ్య సమన్వయ వాతావరణం కల్పిస్తూ, ఎన్నికల్లో బాధ్యులను నియమించడానికి ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు

10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

ఈ నెల 10,11 తేదీల్లో అంగన్వాడీల కోర్కెల దినాల సందర్భంగా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపు నిచ్చారు. గురువారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరళకుమారితో కలిసి ధర్నా గోడ పత్రికలను విడుదల చేశారు. ధర్నాను పెద్దఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సెక్టార్ లీడర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులు తరగతులకు రావొచ్చు

ప్రజాశక్తి - బలిజిపేట

ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ విద్యను కొనసాగించవచ్చని, ఈమేరకు వారు తరగతులకు రావచ్చునని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎం.జ్యోతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు సెకెండ్ ఇయర్ తరగతిలో కొనసాగించవచ్చునని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులంతా వినియోగించుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని రెండో రోజు దుడ్డుఖల్లు పంచాయతీ పరిధిలో గల కొత్తవలస, లోవలక్ష్మీపురం, బొడ్లగూడ, చింతలపాడు గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి గిరిజనులకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, జడ్పిటిసి రాధిక, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ సింహాచలం

విద్యాభివృద్ధిలో హెచ్ఎంలు కీలకపాత్ర పోషించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

విద్యాభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని, మండలాన్ని విద్యాపరంగా ముందు వరుసలో నిలబెట్టాలని ఎంఇఒలు సామల సింహాచలం, కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కిట్లలోని వస్తువులన్నీ వంద శాతం విద్యార్థులకు అందజేసి వారి నుంచి బయోమెట్రిక్ వేయించాలన్నారు. నూతన విద్యా విధానాలను పాఠశాలల్లో అమలు చేయాలని కోరారు. అనంతరం ఎంఇఒలను ప్రధానోపాధ్యాయులంతా అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. సమావేశంలో సీఆర్పీలు శ్రీరామ్, మధు, వైకుంఠరావు, సుభాషిణి, ఝాన్సీతో పాటు ఎమ్మార్సీ, సిబ్బంది శారద, రామయ్య పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పొడి పంచాయతీలో గల వబ్బంగికి రూ.కోటీ50 లక్షలతో కొత్తగా మంజూరైన 1.9 కిలోమీటర్ల బిటి రోడ్డు పనులను గురువారం స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుస్మిత, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి సభ్యులు జి.సుజాత, వాణిజ్య విభాగాల వైసిపి జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపీటీసీలు వి.బంగారునాయుడు, టివిఎస్ స్వామియాజులు, సునీత, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ఆదిల్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరురూరల్

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. గురువారం అన్నమరాజువలసలో స్థానిక పాఠశాలలో విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవాలని జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి గ్రామంలో స్థానిక వైద్య సిబ్బందితో కలిసి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ అధ్యక్షులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు మేలేని పద్ధతులు అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని ఆర్,వెంకంపేటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఫ్రీ బ్యాలెట్ బాక్స్ పద్ధతి నిర్వహించారు. మేలైన పద్ధతిలో అవగాహన తెలుసుకుంటే తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. సంక్షేమ పథకాలకు రక్ష


ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రక్షణగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని బందలుప్పి, చినబొండపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పథకం ఆవశ్యకతను, అవసరాన్ని ప్రజలకు సవివరంగా వివరించి, కొత్తగా మంజూరైన 11రకాల సేవల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రజా దర్బారు నిర్వహించి, స్థానిక ప్రజల సమస్యల గుర్తించి వాటి పరిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు, సిద్ద జగన్నాధ రావు, పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎంపిడిఒ సంపంగి రమేష్, తహశీల్దార్ శివన్నారాయణ, సర్పంచులు యాళ్ల ప్రమీల, గండి శంకరరావు, ఎంపిటిసి సభ్యులు బంకురు రవికుమార్, మండల సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని గాదిలవలస, దయానిధి పురం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రామచంద్రరావు, ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్, తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిపి రవణమ్మ శ్రీరామనాయుడు, జెడ్పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, ఆర్వి పార్థసారథి, ఆయా గ్రామా సర్పంచులు సావిత్రమ్మ, తెంటు రామారావు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో కిచ్చాడ పంచాయతీలో గురువారం సర్పంచ్ జి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష పథకం సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి శెట్టి పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులై ఇంకా మిగిలిన లబ్దిదారులకు నేరుగా సచివాలయంలో సమావేశం జరిగిన రోజున వారి వినతి స్వీకరించి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, అయ్యర్కల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జి.విజయచంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని హుస్సేన్పురం, తలవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు టి.లక్ష్మి, సిహెచ్ మధుసూదనరావు, ఎంపిటిసిలు ఎన్.రాముడమ్మ, గౌరీపార్వతి, సచివాలయ కార్యదర్శులు షణ్ముఖరావు, పాపారావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సీతానగరం : ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

టిడిపి టికెట్ రేసులో బోనెల విజయచంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసేందుకు తాజా, మాజీలతో పాటు మరి కొంతమంది పోటీ పడుతున్నారని చెప్పవచ్చు. అయితే రానున్న ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వాలని పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ఆలోచన చేస్తున్నట్లు టిడిపి ఆశావాహుల్లో చర్చ నీయాంశమైంది. ఈ మేరకు మండలంలోని నర్సిపురానికి చెందిన బోనెల విజయచంద్ర పేరు అధిష్టానం పరిశీలనలోకి వచ్చిందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయి నాయకులను కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించమని కోరినట్లు విజయ్ చంద్ర వర్గీయులు చెబుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన విజయ్చంద్ర టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగానూ, గ్లోబల్ ఇంటెన్షియల్ ఫర్ మాదిగ ఛాంబర్ ఫౌండర్ మెంబర్గానూ, జాయింట్ సెక్రటరీగా పనిచేయడంతో ఆ పార్టీ అధినేతల దృష్టిలో ఉందనే చర్చ నియోజకవర్గంలో జోరుగా వినిపిస్తుంది. విజయ్ చంద్ర రాజకీయంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా గుర్తింపు పొందినట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతుంది. మాదిగ సామాజిక వర్గానికి చెందిన విజయ్ చంద్ర నియోజకవర్గంలో గల సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మున్సిపాలిటీ కేంద్రంలోనూ తమ సామాజిక వర్గం మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్టానం ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.


నారా లోకేష్తో విజయచంద్ర

మహిళా హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మహిళల హక్కుల కోసం పోరాడాలని ఎపి మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ప్రథమ మహాసభ జిల్లా నాయకులు మండంగి సుశీల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో దుర్గ భవాని, రాష్ట్ర నాయకులు ఎ.విమల మాట్లాడారు. మహిళలకు సమాజంలో సమాన ప్రాధాన్యత లేకపోవడంతో రెండో తరగతి పౌరులుగా మిగిలిపోతున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయకపోవడంతో కూలీ రేట్లు వ్యత్యాసం తీవ్రంగా ఉందన్నారు. అలాగే మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు పట్టీపట్టినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మన్యం జిల్లాలో గిరిజనుల పట్ల నిర్లక్ష్య ధోరణిగా ప్రభుత్వం వ్యవరిస్తుందన్నారు. గిరి శిఖర గ్రామాల్లో తాగునీరు లేక సరైన వైద్యం లేక, చదువుకోవడానికి స్కూల్ లేక గిరిజన ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సహాయ కార్యదర్శి తోట జీవ పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా వై.సావిత్రి, ప్రధాన కార్యదర్శిగా మండల నీలమ్మ, ట్రెజరీగా మండింగి సుశీల, నలుగురు సహాయ కార్యదర్శులు, నలుగురు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.


వీరఘట్టంలో చెట్టు నీడలో రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చెట్టు నీడలో వైద్య సేవలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు చెట్లు నీడలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో కత్తులకవిటి ,హుస్సేన్ పురం ,నడుకూరు, నర్సిపురం, వండువ, నీలానగరం గ్రామాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు లేకపోవడంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను వైద్య సిబ్బంది ఇరుకైన గదుల్లోనూ, పశువుల పాకల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గురువారం వీరఘట్టం సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చెట్లు నీడ కింద ప్రజలకు వైద్య సేవలందించారు. దీంతో ఇటు వైద్య సిబ్బంది, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైయస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు సంర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ దేవకుమార్ అన్నారు. పశు వైద్య కేంద్రంలో ప్రపంచ జునోసిన్ డే సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. అలాగే నిడగల్లు పశువైద్యాధికారి ఎం.రామారావు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంర్ధకవాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పశు వైద్యశాలలో ఎడి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కల నుంచి మనుషులకు వ్యాధులు రాకుండా 50 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సిద్ధార్థ్, సిబ్బంది ఉన్నారు.

సీతంపేటలో భారీ వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కాసింది. అనంతరం ఒక్కసారిగా ఆకాశమంతా కారుమబ్బులతో నిండి కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు చల్లడానికి అనువుగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనంతోనే పంట బాగు

ప్రజాశక్తి - పాచిపెంట

విత్తనం బాగుంటేనే పంట బాగుంటుందని, కావున మేలైన, నాణ్యమైన రకాలను మొలక శాతం పరీక్షించిన తర్వాత విత్తన శుద్ధి చేసుకుని నారు పోసుకుంటే ఆరోగ్యవంతమైన నారు పెరుగుతుందని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస రైతు భరోసా కేంద్రం పరిధిలో చెరుకుపల్లిలో నిర్వహించిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేశాక సుడోమోనాస్తో విత్తనానికి 10 గ్రాములు కలుపుకొని విత్తన శుద్ధి చేసిన తర్వాత నారుమడి పోసుకోవాలని తెలిపారు. అవసరాన్ని బట్టి 1.5 కేజీ కార్బో ఫిరాన్, మూడు శాతం గుళికలు చల్లుకోవాలని, మూడు కిలోల యూరియా, కేజీన్నర ఎస్ఎస్పి, అరకిలో పొటాష్ నారుమడికి వేసుకోవాలని సూచించారు. అలాగే తెగులు రాకుండా సాఫ్ ఒక గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకులు పారిపోయినట్టు కనిపిస్తే జింక్ లోపంగా గుర్తించి చిలామిన్ జింక్ ఒక లీటర్ నీటికి రెండు, మూడు గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం నారుమడులను, పొలంబడి క్షేత్రంలో వేసే పచ్చి రొట్ట పంటను పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతినాయుడు, ఐసిఆర్పి సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పాలకొండ

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ప్రతి రైతుకు వ్యవసాయ పెట్టుబడుల కోసం ఎకరాకు రూ.10వేలు చొప్పున అందజేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న జీపు జాతా రెండో రోజు గురువారం లుంబూరులో ప్రారంభమై పాలకొండ, ఓణి, గుడివాడ, కోటిపల్లి, ఎల్ఎల్ పురం, ఎం.సింగపురం, బడ్డుమాసంగి, ఆర్బిఆర్ పేట, పొట్లి నవగాం, వీరఘట్టం మండలంలో బొడ్లపాడు,తూడి, రేగులపాడు, వీరఘట్టం, చలివేంద్రి, నర్సిపురం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా ఉద్యమం సాగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 3న రైతులతో సంతకాలు చేసి సచివాలయాలకు వినతులు అందజేశామన్నారు. అలాగే ఈనెల 5నుంచి జీపు జాతాలు నిర్వహిస్తున్నామని, 10,11,12 తేదీల్లో మండల కేంద్రాలలో నిరసన దీక్షలు, 17, 18, 19 తేదీల్లో నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టుగా పేర్కొన్నారు. చివరగా ఈనెల 26 నుండి 30 విజయవాడలో నిరసన దీక్ష జరుగుతాయని, అప్పటికి ప్రభుత్వాలు దిగి రాకపోతే 31 నుంచి జరిగే నిరవధిక దీక్షలకు పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు, కోశాధికారి బొత్స గౌర్నాయుడు పలువురు రైతులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధిత సమస్యలు పరిష్కారమెప్పుడు?

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఇచ్చిన హామీ ఏమయ్యాయని జనసేన నాయకులు ప్రశ్నించారు. గురువారం జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి, జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రూ.1183 కోట్లు కేటాయించి, 11 లక్షలు చిన్న డిపాజిట్ దారులకు డబ్బు చెల్లిస్తానని ఆరు మాసాల్లో మొత్తం డిపాజిట్ దారులకు డబ్బు చెల్లించే బాధ్యత తనదేనని, కోర్టు, కంపెనీ విషయమై తాను చూసుకుంటానని ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని మర్చిపోవడం అన్యాయమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఎద్దేవా చేశారు. పిల్లలు చదువులు ఆగిపోవడం, పెళ్లిళ్ల చేయలేక, ఆరోగ్య సమస్యలతో అగ్రి గోల్డ్ బాధితులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారని తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖాతా విశ్వేశ్వరరావు, చిట్లి గణేష్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, గుంట్రెడ్డి గౌరీ శంకర్, కర్రీ మణి, కొల్లి వెంకటరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నకుమారి రైతులకు సూచించారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో ఘన పదార్థాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరగడంతో పాటు పంట అధిక దిగుబడి రావడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కావున ప్రతి రైతు ఘన పదార్థాల ద్వారా ఎరువులు తయారు చేసుకొని పంటలు సాగు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకృతి ద్వారా ఎరువు తయారుచేయు విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జక్కువ సౌజన్య, డెమో సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

ఆరు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మక్కువ మండలం డి.శిర్లాం ఇసుక రీచ్ నుండి పార్వతీపురం పట్టణానికి అక్రమంగా తరలివస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను గురువారం ఎస్బి పోలీస్ ఇన్స్పెక్టర్ శర్మ స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసు స్టేషన్కు అప్పగించారు. పై అధికారుల ఆదేశాల మేరకు వీటిని పట్టుకున్నట్టు తెలిపారు.


జగజ్జీవన్రామ్కు నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

జగ్జీవన్రామ్కు నివాళి

ప్రజాశక్తి -సాలూరు

దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్రాం వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రపటానికి డిప్యూటీ సీఎం రాజన్నదొర పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకొచ్చిన మహనీయుడు బాబూ జగజ్జీవన్ రాం అని రాజన్నదొర కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబు, దండి శ్రీనివాసరావు ఉన్నారు.

పాలకొండ : స్థానిక నగరపంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న భారతరత్న డాక్టర్ బాబు జగ్జీవన్రామ్ విగ్రహానికి కమిషనర్ సర్వేశ్వరరావు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో జగ్జీవన్రాం సేవలను కొనియాడారు. దళిత సంఘ నాయకులు నూతలపాటి భరత భూషణ్, యెమ్మలా సతీష్ కుమార్ బత్తిన మోహన్ రావు, గురుబిల్లి రవికుమార్, తిర్లంగి ఉపేంద్ర, సర్పంచ్ భోగి విశ్వేశ్వరరావు, టి.వెంకట్, పొట్నూరు రమేష్, వై జాకబ్, యజ్జల సురేష్, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని బాబు జగజీవన్ రావ్ కాలనీలో భారత ఉప ప్రధాని బాబు జగజీవన్రావ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత వీధి పెద్దలు విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.రాంకుమార్, ఒ.జయలక్ష్మి, ఎన్.దాలయ్య, బి.పైడయ్య, వివస్ పాల్, ఎస్.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న అభిమానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అనారోగ్యంతో బాధపడుతున్న నందమూరి అభిమాని ముగడ హరిప్రసాద్కు పట్టణ నందమూరి సేవా సంఘం సభ్యులు గురువారం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ పట్టణంలో వివేకానంద కాలనీకి చెందిన ముగడ హరిప్రసాద్ (సంతు) జీవనోపాధి కోసం రోజువారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే సమయంలో గత ఎనిమిది నెలలుగా అనారోగ్యం బారినపడి విశాఖలో వైద్యం చేసుకుంటున్నాడు. హరి అనారోగ్య, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న నందమూరి అభిమానులు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి సేవా సంఘం పట్టణ అధ్యక్షులు యడ్ల శ్రీను, కార్యదర్శి శెట్టి నారాయణ, కోశాధికారి ఈదుబిల్లి సంతు, ఉపాధ్యక్షులు తోట నాగరాజు, సహకార్యదర్శులు బూర్లి వెంకటకష్ణ, రౌతు చిన్న, మక్కువ కిషోర్ అభిమాని ఏగిరెడ్డి శ్రీను, సీనియర్ అభిమాని పాకల సన్యాసిరావు లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బివి రమణ

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా జెఎసి కోఆర్డినేటర్ బి వి రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంఇఒ కార్యాలయ ఆవరణలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2, 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయించడం వల్ల అతి కొద్ది మంది మాత్రమే రెగ్యులరైజ్ అవుతారని, కావున 2022 డిసెంబర్ 31 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్స్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందర్నీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని, లేనిచో ఉద్యోగులను ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ఈనెల 24న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో కాంట్రాక్టు ఔట్ సోర్సిగ్ ఉద్యోగులు, కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి పాలకొండ ఏరియా నాయకులు లక్ష్మణరావు, సత్యనారాయణ, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజావక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని చెగిడి వీధికి చెందిన పూతి మహేష్ (25) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుండి లారీ వచ్చి ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ వీరఘట్టంకు చెందిన వ్యక్తిగా గుర్తించి పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. మహేష్ డిగ్రీ పూర్తి చేసుకుని మూడేళ్లుగా విశాఖపట్నంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మహేష్కు తల్లిదండ్రులు త్రినాధరావు ,మహాలక్ష్మి ఉన్నారు.

ఉరివేసుకొని యువతి మృతి

పాలకొండ: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కందుల మానస(24) గురువారం తన స్వగృహంలో ఉరివేసుకుని మరణించింది. పోలీసులు, కుటుంబీకులు అందించిన వివరాల మేరకు కందుల సరేష్, లక్ష్మి దంపతులు లోగిడి వీధిలో కిరాణా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరిలో రెండవ కుమార్తె మానస చిన్నతనం నుంచి బుద్ధి మాన్యతతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతుంది. ఇటీవల డిగ్రీ పరీక్షల్లో ఉత్తీర్ణత చెందకపోవడంతో మానసికంగా బలహీనపడి గత కొద్దిరోజులుగా దిగులుగా ఉంటున్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన ఇంటి పై గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె ఆత్మహత్యను గుర్తించిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శివప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కురుపాం : మతిస్థిమితం లేని యువతీ పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన గురువారం కురుపాంలోచోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం స్థానిక శోభలతాదేవి కాలనీకి చెందిన బోయన సంగీత (25)కు మతిస్థిమితం బాగోలేదు. ఇంటి చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తొలగించడానికి తీసుకొచ్చిన గడ్డి మందును ఆమె తాగడంతో బంధువులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్కదాడిలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో గురువారం పిచ్చికుక్క దాడి చేసిన సంఘటనలో దాదాపు 11 మందికి గాయాలయ్యాయి. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువుర్ని గాయపర్చడంతో వీధుల్లోకి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. క్షతగాత్రులు స్థానిక పిహెచ్సిలో చికిత్స పొందుతున్నారు.